క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే



డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

సుల్తానాబాద్‌రూరల్: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే పంపిస్తామని ట్రాఫిక్ ఎస్సై జావేద్ అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామ శివారులోని కాల్వశ్రీరాంపూర్ రోడ్డులో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు హెల్మెట్ ధరించని వాహనాదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అలాగే చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహనాదారులతో చలాన్లు కట్టించామని తెలిపారు. తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత



చెట్లకొమ్మలు తొలగిస్తున్న గ్రామస్తులు

జ్యోతినగర్: స్వచ్ఛత మనందరి బాధ్యత అని డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లె రోడ్డులో ఉన్న పిచ్చిమొక్కల తొలగింపుతో పాటు వీధి దీపాల వెలుతురుకు అడ్డుగా ఉన్న కొమ్మల తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం పునరావాస నర్రాశాలపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో వీధిదీపాలు ఉన్నప్పటికీ వాటి వెలుతురు రోడ్డుపై పడకుండా ఉన్న చెట్టుకొమ్మలను గ్రామస్తులతో కలిసి తొలగించామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మించడంలో ఎన్టీపీసీ సంస్థ సహకారం తీసుకుంటామన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమక్రమంగా అభివృద్ధి చేశాం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మంథని: సహకార సంఘం సభ్యులు, పాలకవర్గం, సిబ్బంది సహకారంతో సంఘాన్ని క్రమక్రమంగా అభివృద్ధి చేసినట్లు మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. సహకార సంఘం పాలకవర్గం గడువు మరో ఆరు నెలలు పొడిగించిన సందర్భంగా స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా మరిన్ని సేవలు విస్తరించి సంఘ సేవలను రైతులకు చేరువ చేస్తామని తెలిపారు.

నారాయణరావుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి గ్రామంలో ఆదివారం మెడికవర్ కరీంనగర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు హర్షిత్, సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని మనోజ్, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ అంజయ్యగౌడ్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయండి



పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీ ఒక్కరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రామగిరి మండలం వెంకట్రావుపల్లి మాజీ ఎంపీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ బాల అంకూస్ అన్నారు. మహాత్మా జ్యోతి పూలే, అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యైటింక్లయిన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాయకులు సదానందం, శంకర్, సమ్మయ్య, సురేశ్, ఐలయ్య, ఆదినారాయణ, రాజశేఖర్, బషీర్, వెంకటేశ్, సారయ్య పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో కానరాని అభివృద్ధి

- రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సరఫరాలో ఇబ్బందులు



పూసాలలో డ్రైనేజీలో నిలిచిన మురికినీరు

సుల్తానాబాద్: పట్టణ అభివృద్ధి కోసం సమీప గ్రామాలను సుల్తానాబాద్ మున్సిపల్‌లో విలీనం చేశారు. ఐదేళ్లవుతున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్‌లో పూసాల, సుగ్లాంపల్లి విలీనం అయ్యాయి. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని స్థానికులు అంటున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌తో అన్నిరకాల అభివృద్ధి చెందుతుందని భావిస్తే ఉపాధిహామీ పోయిందని, కూలీ దొరకడం లేదని వాపోతున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారం శుభ్రం చేయకపోవడంతో మురికినీరు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయాలి



మున్సిపల్ ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నప్పటికీ విలీన గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదు. మా ఎస్సీకాలనీలో మూడేళ్ల క్రితం సీసీరోడ్డు వేస్తామని కంకర వేసి ఇప్పటివరకు వేయలేదు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. మంచినీరు సక్రమంగా సరఫరా చేసి వేసవికాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి.

– లంక శంకర్, మాజీ సర్పంచ్, పూసాల

సమస్యలు నాదృష్టికి తీసుకురావాలి



మున్సిపల్‌లో విలీనమైన పూసాల, సుగ్లాంపల్లిలో వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటా. డ్రైనేజీలను శుభ్రం చేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తా. సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా.

– మహమ్మద్ నియాజ్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్

మేడారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. 2000–01లో మేడారం హైస్కూల్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు శ్రీపతిరావు, నర్సింగం, కరుణను సన్మానించారు. మిట్ట భరత్‌కుమార్, కట్ట రమేశ్, కొండ సతీశ్, వేల్పుల హరీశ్, రవి, నరేశ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



కప్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తి నింపేందుకు టీటీఎస్ అంతర్గాంకు చెందిన ఏపీజే అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలు ముగియడంతో గెలుపొందిన విజేతలకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదివారం బహుమతులు అందజేశారు. విలేజి అంతర్గాం జట్టు (ప్రథమ), రామగుండం రైల్వేస్టేషన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రవినాయక్, క్రీడాకారులు, కాంగ్రెస్ ప్రతినిధులు హాజరయ్యారు.



పోచమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు (ఫైల్)



చోరీకి గురైన చెత్త డబ్బాలు

'చెత్త' డబ్బాలు మాయం

రామగుండం: కూడళ్లలో తడి–పొడి చెత్త సేకరణకు కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ చెత్త డబ్బాలు మాయం అయ్యాయి. పట్టణంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలోని కూడలిలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ చెత్త డబ్బాలు చోరీకి గురయ్యాయి. కూడళ్లలోని సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని కాలనీవాసులు కోరుతున్నారు. స్వచ్ఛ భారత్‌లో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలను సైతం చోరీ చేయడంపై అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మంథనిలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

మంథని: మంథనిలోని ఎల్ఎల్‌బీ గార్డెన్‌లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

బూడిద కింద పడకుండా చర్యలు తీసుకోవాలి



లారీ నుంచి బూడిద కింద పడడంతో లేస్తున్న దుమ్ము


సుల్తానాబాద్: రహదారి వెంబడి ఇటుక బట్టీల కోసం వెళ్తున్న లారీల నుంచి బూడిద కింద పడి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఎన్టీపీసీ నుంచి జిల్లాలో ఉన్న పలు ప్రాంతాల ఇటుక బట్టీల యాజమాన్యానికి లారీల ద్వారా బూడిద తరలిస్తుంటారు. లారీ డ్రైవర్లు యాష్ కింద పడకుండా పైన కప్పు భద్రంగా ఏర్పాటు చేసుకోవాలి. కానీ నామమాత్రంగా కప్పుకొని వెళ్లడంతో బూడిద కిందపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ఎంవీఐలు, పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పొగతో ఊపిరాడడం లేదు



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో ప్రధాన రహదారిపై ఆదివారం కార్పొరేషన్ చెత్త కాల్చివేశారు. చెత్త నుంచి వస్తున్న పొగతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. మంటలు చెలరేగి సుమారు 100 చెట్లు కాలిపోయాయని స్థానికులు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి చెత్తను కాలుస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఎస్సారెస్పీ క్వార్టర్స్



నిరుపయోగంగా ఎస్సారెస్పీ క్వార్టర్స్

సుల్తానాబాద్: పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో ఉన్న ఎస్సారెస్పీ క్వార్టర్స్ ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయని, తలుపులు తొలగించడంతోపాటు గంజాయి, మత్తుకు అలవాటు పడ్డ యువత అందులో వచ్చి సిగరెట్లు కాలుస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్వార్టర్స్‌కు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమం



భక్తులకు హారతి ఇస్తున్న పూజారి

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయం, సాంబ శివాలయంలో మాఘమాసం సందర్భంగా వచ్చిన సంకష్టిలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. హాజరైన భక్తులకు పూజారులు మహేశ్, రమేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల కమిటీ చైర్మన్లు ఎల్లంకి సత్యనారాయణ, అరుణ్, పల్ల మురళీధర్, శరత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ పరిసరాల్లో మురికి నీరు చేరడంతో తాగునీరు కలుషితం అవుతోంది. ట్యాంక్ చుట్టుపక్కలా నీరు నిల్వ ఉండడంతో పందులు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో మురికినీరు చేరి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. కార్పొరేషన్ అధికారులు స్పందించి వాటర్‌ట్యాంక్ పరిసరాలను శుభ్రం చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

మారుపేర్ల విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ల నాయకులు

గోదావరిఖని: సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్, టీబీజీకేఎస్, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. స్థానిక తిలక్‌నగర్‌లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఐక్యవేదిక సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ సమస్యలతో బాధపడుతున్న బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా.. సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆరోపించారు. కారుణ్య నియామకం పేరిట సంస్థలో ఉద్యోగం కల్పించాలని విన్నవించారు. అనారోగ్యంతో మెడికల్ ఇన్విటేషన్ పెట్టుకుంటే పేరు మార్పిడి ఉందని ఎనిమిదేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం కార్మికుల పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే కమిటీ వేసి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణిలో గుర్తింపు సంఘాలుగా గెలిచి యూనియన్ల వైఫల్యంతో మూడునెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు రియాజ్ అహ్మద్, కృష్ణ, లక్క శ్రావణ్ పాల్గొన్నారు.

సర్వే దరఖాస్తులకు మళ్లీ అవకాశం



సుల్తానాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది



జూలపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో పద్మజ

సుల్తానాబాద్: ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. పట్టణంలోని మున్సిపల్, ఎంపీడీవోల కార్యాలయాల్లో దరఖాస్తులను ఉద్యోగులు, సిబ్బంది స్వీకరిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఆదివారం తెలిపారు. గతేడాది జిల్లావ్యాప్తంగా సుమారు నెలరోజులకు పైగా ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. అయినప్పటికీ ఎక్కువ సంఖ్యలో సర్వేలో పాల్గొనలేదు. దీంతో ఈనెల 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

సర్వేకు మరో అవకాశం

మంథని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వేలో గతంలో పాల్గొనని కుటుంబాల కోసం మళ్లీ అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఈ నెల 28 వరకు అవకాశం ఉందని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కౌంటర్ ప్రారంభం

జూలపల్లి: మండలవ్యాప్తంగా గతంలో నిర్వహించిన ఆర్థిక, రాజకీయ, ఉపాధి, కులగణనకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఎంపీడీవో పద్మజ ఆదివారం ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేలో అందుబాటులో లేని కుటుంబాలు రెండోసారి ప్రత్యేకంగా చేపట్టిన సర్వేలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇ–పంచాయతీ ఆపరేటర్ తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

కాల్వశ్రీరాంపూర్: సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి గణనాథునికి పంచామృత అభిషేకంతో పాటు, ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడికి ఇష్టమైన ఉండ్రాళ్లు, పాయసం, గరికతో నైవేద్యం సమర్పించారు. చంద్రోదయం తదుపరి ఉపవాస దీక్షను విరమించారు.